క్లుప్తంగా

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ఉయ్యాలవాడ: మండలంలోని ఆర్.జంబుల దిన్నె, ఉయ్యాలవాడ, ఇంజేడు, సుద్దమల్ల గ్రామాల్లోని ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. అభయాంజనేయస్వామి, శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి, లక్ష్మీ నరసింహ కంబ గిరి స్వామికి అభిషేకాలు, కుంకుమార్చన, ఆకుపూజలు నిర్వహించారు. భక్తులు స్వామివార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అర్చకులు లక్ష్మణస్వామి, భాస్కరశర్మ, అనంతయ్య తీర్థప్రసాదాలు అందజేశారు.

3 నుంచి పొలం పిలుస్తోంది



గోడపత్రికను విడుదల చేస్తున్న మంత్రి ఫరూక్

గోస్పాడు: ఈనెల 3వ తేదీ నుంచి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఏఓ స్వప్నికారెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం న్యాయశాఖ మంత్రి ఫరూక్ తన కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులతో కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. ప్రతి మంగళ, బుధవారాల్లో వ్యవసాయాధికారులు రైతుల వద్దకు వెళ్లి నూతన పద్ధతులు, సేంద్రియ వ్యవసాయం, ఆధునిక సాగు పద్ధతులు, పంటల మార్పిడి, ఎరువుల వాడకం తదితర వాటిపై రైతులకు అవగాహన కల్పిస్తారని వివరించారు.

మద్యం స్వాధీనం.. వ్యక్తి అరెస్ట్



నిందితుడు, మద్యం బాటిళ్లను చూపుతున్న ఎస్‌ఐ

దొర్నిపాడు: గుట్టుచప్పుడు కాకుండా మద్యం విక్రయిస్తున్న స్థావరాలపై పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా దొర్నిపాడుకు చెందిన నాగూర్‌బాషా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో సోదాలు చేసి 17 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. దాడుల్లో ఏఎస్‌ఐ రంగయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌కు సన్మానం



ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

శిరివెళ్ల: యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణారెడ్డి శనివారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను అధ్యాపకులు, సిబ్బంది శాలువాలు కప్పి పూలమాలలతో సన్మానించారు. 12 ఏళ్ల కళాశాలలో పని చేసి 76 మంది ఉన్న విద్యార్థుల సంఖ్యను 330 మందికి పెంచారు. ఎన్‌సీసీ యూనిట్ మంజూరు, 10 జాబ్ మేళాలను నిర్వహించిన ఘనత ప్రిన్సిపాల్‌కే దక్కుతుందని అధ్యాపకులు కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులరెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

దొర్నిపాడు: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని ఏఈ రామ్మోహన్ అన్నారు. శనివారం దొర్నిపాడు విద్యుత్ సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తడిసిన విద్యుత్ స్తంభాలను తాకవద్దని, రైతులు మోటార్లు, స్టార్టర్లను ముట్టుకోవద్దని సూచించారు. విద్యుత్ లైన్లు చెట్లకు తాకుతుంటే షాక్‌కొట్టే ప్రమాదం ఉందన్నారు. ఇళ్లలో తడిసిన స్విచ్చులు, బయట లైట్లు వర్షపు నీటితో తడిసే అవకాశం ఉన్నందున్న జాగ్రత్తగా ఉండాలన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలను విద్యుత్ పరికరాలకు దూరంగా ఉంచాలని సూచించారు. ఉరుములు మెరుపులు వచ్చిన ప్పుడు డిష్ కనెక్షన్ తొలగించి, బట్టలను విద్యుత్ ఇనుప తీగలపై ఆరవేయరాదన్నారు. కరెంట్ లైన్ల కింద సెల్‌ఫోన్ మాట్లావద్దని ఎద్దైనా విద్యుత్ సమస్య ఉంటే వెంటనే లైన్‌మెన్లకు ఫోన్ చేయాలని కోరారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నంద్యాల(సిటీ): పట్టణంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం పట్టణ శివారులో ప్రవహిస్తున్న మద్దిలేరువాగు ఉధృతిని శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా పట్టణంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ముఖ్యంగా 1వ వార్డు పీవీ నగర్ ప్రజలు పలు జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. వరద ఉధృతి పెరిగితే వాగు దాటొద్దని స్థానికులకు సూచించారు.



క్రిష్టిపాడు వద్ద వంతెనపై ప్రవహిస్తున్న కుందూనది



కలుగొట్లపల్లె రహదారి వంతెన వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న భవనాసి

ఉప్పొంగిన కుందూ

దొర్నిపాడు: రెండు రోజులుగా మండలంలో కుండపోత వర్షం కురుస్తోంది. వాగులు, వంకలు, కుందూనది ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా వాన కురుస్తుండడంతో స్థానికులు బయటకు వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 21.4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ సుభద్ర శనివారం తెలిపారు. కుందూ పరివాహ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే మట్టిమిద్దెల్లో నివాసం ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలని వీఆర్వో సాంబశివుడు సూచించారు.

కలుగొట్లపల్లె వంతెనపై రాకపోకలు నిషేధం

చాగలమర్రి: భారీ వర్షాలకు వంకలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయని.. వరద నీటి ఉధృతి ఎక్కువగా ఉండడంతో ఆయా తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చాగలమర్రి ఎస్‌ఐ రమేష్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కలుగొట్లపల్లె, మల్లెవేముల, కూలూరు గ్రామాలకు వెళ్లే రహదారుల్లో వక్కిలేరు, కుందూ, భవనాసి వరద నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కలుగొట్లపల్లె గ్రామానికి వెళ్లే రహదారిలో భవనాసి వాగు ఉధృతంగా ప్రవహిస్తోందని, గ్రామస్తులు వంతెనపై నుంచి రాకపోకలు సాగించవద్దని సూచించారు. ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. మండలంలోని రాజోలి ఆనకట్ట వద్ద 14,100 క్యూసెక్కుల వరద నీరు కుందూలో ప్రవహిస్తుండగా, 520 క్యూసెక్కులు కేసీ ప్రధాన కాలువకు, చాపాడు చానల్ 110 క్యూసెక్కులు వదిలినట్లు ఏఈ జమాల్‌వలి తెలిపారు. శనివారం ఉదయం నుంచి 2 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం పెరిగినట్లు పేర్కొన్నారు.

నేలంపాడులో కూలిన మట్టి మిద్దె

చాగలమర్రి: మండలంలోని చిన్నవంగలి గ్రామంలో కొద్ది రోజుల క్రితం నిద్రిస్తున్న కుటుంబంపై మట్టిమిద్దె పైకప్పు కూలి నలుగురు మృత్యువాత పడిన సంఘటన మరువక ముందే శనివారం నేలంపాడు గ్రామంలో మరో మట్టిమిద్దె పై కప్పు కూలింది. ఆ సమయంలో కుటుంబ సభ్యులు ఇంట్లో లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. నేలంపాడు ఎస్సీ కాలనీకి చెందిన బోల్లు భూషణంకు చెందిన మట్టి మిద్దె నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కుప్పకూలింది. కుటుంబ సభ్యులు బయట ఉండటంతో ప్రాణాపాయం జరగలేదు. సచివాలయ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, వీఆర్వో హసీనా సంఘటనా స్థలానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. సహాయక చర్యలు చేపట్టారు. కాగా చిన్నవంగలి గ్రామంలో మట్టి మిద్దె కూలిన సమయంలో నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి మండలంలో మట్టి మిద్దెలను సర్వే చేయించి అందులో నివసిస్తున్న వారిని ఖాళీ చేయించాలని మండల రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మండలంలో 959 మట్టి మిద్దెలు ఉన్నట్లు గుర్తించారు. అయితే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు.

యాజమాన్య పద్ధతులతో చీడ పీడల నివారణ

- వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు పంటల్లో చర్యలు చేపట్టాలి
- పంటలు నీటి ముంపునకు గురికాకుండా చూసుకోవాలి
- వర్షపునీటిని బయటకు పంపించే మార్గాలు ఏర్పాటు చేసుకోవాలి
- జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ



నంద్యాల(రూరల్): నంద్యాల జిల్లాలో ఖరీఫ్‌లో సాగుచేసిన వివిధ దశల్లో ఉన్న పంటలు అధిక వర్షాలకు చీడపీడలు సోకే అవకాశముందని రైతులు యాజమాన్య పద్ధతులు పాటించి వాటిని నివారించుకోవచ్చని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ..జిల్లాలో అధిక వర్షాలు పడుతున్న నేపథ్యంలో రైతులకు పలు సూచనలు సలహాలు, పద్ధతులు పాటించాలని చెప్పారు. పొలంలో నీరు నిలవకుండా పాదుల ద్వారా తొలగించాలన్నారు. పొలం ఆరిన వెంటనే అంతర సేద్యం చేసుకోవాలని, సిఫారసు చేసిన ఎరువులను అధికారులు సూచించిన విధంగా వేసుకోవాలన్నారు. నారు మడిలో నిలిచిన నీటిని వీలైనంత త్వరగా బయటకు పంపి పొలాన్ని అరబెట్టాలని చెప్పారు. వర్షాలు తగ్గిన తరువాత లీటరు నీటికి 1.0 మి.లీ ప్రొపికొనజోల్ మందు కలిపి సాయంత్రం వేళల్లో పిచికారీ చేయాలని లేదా లీటరు నీటికి 2.0 మి.లీ హెక్సాకొనజోల్ లేక 20 మి.లీ వాలిడామైసిన్ లేక 1.0 ప్రొపికొనజోల్ లేక 0.4 గ్రా. ట్రైఫ్లాక్సీ స్ట్రోబిన్ 25 శాతం + టెబుకొనజోల్ 50 శాతం కలిపి పిచికారీ చేయాలని సూచించారు. పెరుగుదల దశలో పైరు నీటి ముంపుకు గురైతే పొలంలో ముంపు నీటిని వీలైనంత త్వరగా బయటకు పంపించాలని, ఎకరానికి 20 కిలోల యూరియా 10 కిలోల మ్యురేట్ ఆఫ్ పొటాష్ ఎరువులు పైపాటుగా వేయాలన్నారు. అలాగే.. అపరాలు, కంది, మినుము, సోయాబీన్ తదితర పంటల్లో పెరుగుదల దశలో నీటి ముంపుకు గురైతే పైపాటుగా 19:19:19 ఎరువులను 10 గ్రాములు లీటర్ నీటికి కలిపి పంటపై పిచికారీ చేసుకోవాలన్నారు. భూమి ద్వారా సంక్రమించే ఎండు తెగులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని, ఈ తెగులు ఆశించిన మొక్కల కాండాన్ని చీల్చి చూస్తే మధ్యలో గోదుమరంగు చార కనిపిస్తుందని, నివారణకు కార్బండజిం 1 గ్రాము లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ మందులైన బ్లైటాక్స్ లేదా ఫైటోలాన్ మందును 3 గ్రాములు లీటర్ నీటికి కలిపి మొక్క మొదళ్లలో పోయాలన్నారు. అధిక వర్షాల వల్ల మొగ్గలు, పూత, కాయలు ఎక్కువగా రాలిపోతుంటే ప్లానోఫిక్స్ (ఎన్ఏఏ 10 పీపీఎం) ఎకరానికి 50 మి.లీను 225 లీటర్ల నీటిలో కలిపి మొక్కంతా తడిచేటట్లు పిచికారీ చేయాలని వివరించారు.

లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం

ఆళ్లగడ్డ: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులకు లోక్ అదాలత్‌లో సత్వర పరిష్కారం లభిస్తుందని 5వ అదనపు జిల్లా జడ్జి మురళీకృష్ణ అన్నారు. శనివారం స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో సెప్టెంబర్ 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సివిల్, క్రిమినల్ కేసుల పరిష్కారానికి రాజీయే ఉత్తమ మార్గం అన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోలీస్ అధికారులు ఆయా పోలీస్ స్టేషన్లలో ఉన్న పెండింగ్ కేసులపై కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. లోక్ అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.



మాట్లాడుతున్న 5వ అదనపు జిల్లా జడ్జి మురళీకృష్ణ

కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి ఈశ్వర వెంకటప్రసాద్, ఏపీపీ సోమశేఖర్‌రెడ్డి, డీఎస్పీ రవికుమార్, సీఐలు, ఎస్‌ఐలు, ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

వినాయక చవితిని ప్రశాంతంగా జరుపుకోవాలి



డీఎస్పీని సన్మానిస్తున్న గణేష్ ఉత్సవ కమిటీ

ఆళ్లగడ్డ: వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతగా జరుపుకోవాలని డీఎస్పీ రవికుమార్ ఉత్సవ కమిటీకి సూచించారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా శనివారం ఉత్సవ కమిటీ జిల్లా అధ్యక్షుడు త్రినేత్ర మోహన్‌రెడ్డి డీఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఉత్సవాల నిర్వహణపై వివరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. విగ్రహాల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని.. నిబంధనలు పాటించాలని సూ చించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు రమణ, రామకోటి, సురేంద్ర, చిన్న, నరేంద్ర, రాంపుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈ - పంట నమోదు త్వరగా పూర్తి చేయండి

నంద్యాల(అర్బన్): ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ-పంట నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి వ్యవసాయ అధికారులను ఆదేశించారు శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఈ-పంట నమోదుపై జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 2024 ఖరీఫ్ సీజన్‌లో సాగైన పంట వివరాలను ఈ-పంట నమోదు చేసే ప్రక్రియను ఈ నెల 15వ తేదీలోగా పూర్తి చేయాలని సూచించారు. రాష్ట్రస్థాయిలో నంద్యాల జిల్లా 20వ స్థానంలో ఉందని నిర్ణీత కాల వ్యవధి కంటే ముందుగానే పూర్తిచేసి మెరుగైన స్థానంలో నిలిచేందుకు కృషి చేయాలన్నారు. తక్కువ ప్రగతి చూపిన మండల వ్యవసాయ అధికారులను మందలించారు. జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

క్రీడాకారులకు బహుమతులు



ట్రోఫీ అందజేస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(న్యూటౌన్): జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన క్రీడా పోటీల్లో పట్టణానికి చెందిన గురురాజ పాఠశాల క్రీడాకారులు అత్యధిక పథకాలు సాధించినట్లు డైరెక్టర్ షేక్షావలిరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు కలెక్టర్ బహుమతులు అందజేశారన్నారు. త్రోబాల్‌లో ప్రథమ బహుమతి, చెస్‌లో జిల్లా ప్రథమ స్థానం, ఖోఖోలో జిల్లా ద్వితీయ బహుమతి అందుకున్నారని పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులది కీలక బాధ్యత

పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులదే కీలక బాధ్యత అని, మొక్కలు పెంచాలని గురురాజ ఇంగ్లిష్ మీడియం పాఠశాల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి అన్నారు. వన మహోత్సవం సందర్భంగా పట్టణంలోని అధికారులకు, ప్రముఖులకు జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్‌కు మొక్కలు అందజేశారు.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం

గోస్పాడు: మండలంలోని పసురపాడు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జయ రాజు శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయనను పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు విజయరావు, జేఏసీ నాయకులు కృష్ణారావు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సత్కరించారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, సికిందర్, సురేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

జిల్లాలో 94.5 శాతం పింఛన్ పంపిణీ పూర్తి

నంద్యాల(అర్బన్)/నంద్యాల(న్యూటౌన్)/నంద్యాల(సిటీ): జిల్లాలో ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ సాయంత్రం 6 గంటల సమయానికి 94.5 శాతం పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి శనివారం తెలిపారు. నంద్యాల మండలం కొత్తపల్లె గ్రామం, బండిఆత్మకూరు మండలం ఏ.కోడూరు గ్రామాల్లో కలెక్టర్ రాజకుమారి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. సెప్టెంబర్ 1వ తేదీ ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే అన్ని మండలాలలో వర్షాలు కురుస్తున్నప్పటికీ సాయంత్రం 6 గంటల సమయానికి 2,07,003 మందికి పెన్షన్లను పంపిణీ చేసి 94.5 శాతం పూర్తి చేశామని కలెక్టర్ తెలిపారు. కాగా నందికొట్కూరు మండలం అల్లూరు గ్రామంలో పింఛన్ల పంపిణీలో డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మిగిలిన పింఛన్లు 2వ తేదీ పంపిణీ చేస్తామని చెప్పారు.



27వ వార్డులో పింఛన్లను పంపిణీలో పాల్గొన్న మంత్రి ఫరూక్

మరణ వేదన

శిరివెళ్ల: రెండు ఎద్దులు.. నాలుగు గేదెలు..2 మేకలు ఎప్పటిలాగే అర్ధ రాత్రి వేళ నిద్రిస్తున్నాయి. ఉన్న ఫలంగా మంటలు చెలరేగాయి. మంటలు తగులుతూ నొప్పిపుడుతుండడంతో అంబా..అంబా అంటూ తమ బాధను వ్యక్తపరిచాయి. అయితే ఎవరూ తమ మొర ఆలకించలేదు. కట్టి ఉంచడంతో తప్పించుకోలేని పరిస్థితి. మంటలు ఎగసి పడడంతో ఉన్న చోటే అగ్నికి ఆహుతయ్యాయి. కొంత ఆలస్యంగా గుర్తించిన రైతు, స్థానికులు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించినా అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఈ విషాదకర ఘటన శిరివెళ్ల మండలం గోవిందపల్లెలో శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. జీవనాధారమైన మూగజీవాలు మృతిచెందడంతో బాధిత రైతు శంకర్ గెండులవిసేలా రోదించాడు.



కట్టి ఉంచిన చోటే మృతిచెందిన ఎద్దులు, మేకలు

రసాభాసగా కౌన్సిల్ సమావేశం

నంద్యాల(సిటీ): స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో శనివారం సాధారణ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా ఆధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ పరిధిలోని పలు సమస్యలను కౌన్సిల్ ముందుకు తెచ్చే ముందు తప్పనిసరిగా కౌన్సిల్ సభ్యులతో చర్చించి వాటిని కౌన్సిల్ తీర్మానంలో పొందుపరచాలని పలుమార్లు చెప్పినా ఎందుకు పట్టించుకోవడం లేదని కమిషనర్ నిరంజన్‌రెడ్డిపై చైర్‌పర్సన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పలుమార్లు అజెండాలో అంశాలు పొందుపరచే ముందు సభ్యులకు, చైర్‌పర్సన్‌కు తెలియజేయాలని చెప్పినా ఎందుకు గౌరవం లేకుండా ప్రవర్తిస్తున్నారని నిలదీశాడు. ఇష్టానుసారంగా అజెండాను రూపొందించి సభ్యుల సమస్యలను గాలికి వదిలేయడం సమంజసం కాదన్నారు. అనంతరం అజెండాలోని 10వ అంశం కూరగాయల మార్కెట్ గేట్ వసూలు విషయంలో సరైన పోటీ లేదని, అదే రోజున మున్సిపల్ ఆర్‌ఐ గులాం హుసేన్, ఆర్‌ఓ వెంకటకృష్ణల సస్పెన్షన్ జరగడం వల్ల పలువురు బహిరంగ వేలానికి వచ్చి వెనుతిరిగారన్నారు. కావున ఈ బహిరంగ వేలాన్ని రద్దు చేయాలని పలువురు వ్యాపారులు కోరడంతో మున్సిపాలిటీకి ఆదాయాన్ని చేకూర్చేందుకు వేలాన్ని రద్దు చేయాలని కౌన్సిల్ తీర్మానించింది. అలాగే అజెండాలోని 13వ అంశమైన ఎన్టీఆర్ కాంప్లెక్స్‌లోని 26, 29, 32 దుకాణాలతో పాటు నూనెపల్లె మటన్‌స్టాల్-8 కు ఈఏడాది ఫిబ్రవరిలో వేలం జరిగిందని వాటి విలువ కనీసం పక్కన దుకాణాల విలువ కంటే తక్కువ ఉండడంతో రద్దు చేయాలని సభ్యులు కోరారు.



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా.



వీఎల్టీ పన్ను విధించిన పత్రంలోని డిజిటల్ సైన్ చూపుతున్న వైస్ చైర్మన్ పాంషావలి

కమిషనర్‌ను సస్పెండ్ చేయాలి- వైస్ చైర్మన్ పాంషావలి

నంద్యాల మున్సిపాలిటీలో ఏం జరుగుతుందో సభ్యులకు తెలియడం లేదని, అధికారులు ఇష్టానుసారంగా పన్నులు విధిస్తున్నారని వైస్‌చైర్మన్ పాంషావలి పేర్కొన్నారు. పద్మావతినగర్‌లో న్యాయశాఖ మంత్రికి సంబంధించిన స్థల వివాదంలో వీఎల్టీ(వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్) పన్ను విధించిన విషయంలో కిందిస్థాయి ఉద్యోగులను సస్పెండ్ చేశారని అయితే కమిషనర్ నిరంజన్‌రెడ్డిని కూడా సస్పెండ్ చేయాలని కౌన్సిల్‌ను కోరారు. ఈ విషయంపై లోతైన విచారణ జరపాలని ఉన్నతాధికారులైన డీఎంఏ, ఆర్డీఎంఏలకు కౌన్సిల్ ద్వారా లేఖ రాయాలని చెప్పారు. పన్ను విధింపులో కమిషనర్ డిజిటల్ సైన్ ఉంటుందని తనకు ఆ విషయానికి సంబంధం లేదన్నట్లు ఆయన వ్యవహరించడంపై పలు అనుమానాలు ఉన్నాయన్నారు. కౌన్సిల్‌లో ప్రతిపాదించిన విషయాలనే పట్టించుకోని కమిషనర్.. పన్ను విధింపులో ప్రత్యేక శ్రద్ధ చూపి ఒకే రోజులో పన్ను వేయడం వెనుక పెద్ద మొత్తంలో నగదు చేతులు మారిందని పట్టణ ప్రజలందరికీ తెలుసన్నారు. పట్టణ ప్రజల నుంచి వస్తున్న విమర్శలకు కమిషనర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీకి చెడ్డ పేరు తీసుకురావద్దని సూచించారు.

- అనంతరం పట్టణంలో కుక్కలు, దోమల బెడద తీవ్రంగా ఉందని అధికారులకు చెప్పినా ఎందుకు పట్టించుకోవడం లేదని పలువురు సభ్యులు నిలదీశారు. పలుమార్లు సమస్యలను కౌన్సిల్‌లో ప్రస్తావించినా కేవలం మినిట్స్‌లో నమోదు చేసుకుని వదిలేస్తున్నారని, కేవలం 3 నెలల్లో పట్టణం అస్తవ్యస్తంగా మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ ఇంజినీర్ రమణమూర్తి, ఎంహెచ్ఓ డాక్టర్ అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠోత్సవం



ముకుందాపురంలో ధ్వజ స్తంభాన్ని ప్రతిష్టిస్తున్న భక్తులు

రుద్రవరం: మండల పరిధిలోని ముకుందాపురంలో లక్ష్మీ,మాధవస్వామి విగ్రహం, ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవం శనివారం ఘనగా ముగిసింది. ఓ వైపు మోస్తరుగా వర్షం కురుస్తున్న భక్తుల సమక్షంలో ప్రతిష్ఠోత్సవ కార్యక్రమం వైభవంగా సాగింది. ఆలయ నిర్వాహకులు ప్యాపిలి చిన్న నరసయ్య, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో వేదపండితులు ఉదయం నుంచి వివిధ రకాల పూజా కార్యక్రమాలు, హోమాది పూజలు చేశారు. అనంతరం లక్ష్మీ మాధవస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అలాగే ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ట గావించారు.

3న జాబ్ మేళా

నంద్యాల(న్యూటౌన్): ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 3వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోస్టర్ విడుదల చేశారు. జాబ్ మేళాలో 8 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని సంస్థ అధికారి ప్రతాపరెడ్డి తెలిపారు. ఎస్సెస్సీ, ఐటీఐ, డిప్లొమా, బీఫార్మసీ, ఇంటర్, డిగ్రీ, బీటెక్, పీజీ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. విద్యార్హత పత్రాలతో పాటు ఆధార్ కార్డు, ఫొటోలతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు సెల్: 9181117075 నంబరులో సంప్రదించాలని కోరారు.

31ఎన్‌డీఎల్ 05.. జయరాజును సన్మానిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

చెరువులో పడి మహిళ మృతి

బొమ్మలసత్రం: మహానంది మండలం గోపవరం గ్రామంలో ప్రమాదవశాత్తూ ఓ మహిళ చెరువులో పడి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గోపవరం గ్రామానికి చెందిన లక్ష్మీదేవి (42) శనివారం పశువులు కాసేందుకు బీడు పొలాల వైపు వెళ్లింది. సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చే క్రమంలో పశువులు సమీపంలోని చెరువులోకి వెళ్లాయి. వాటిని బయటకు తోలే క్రమంలో అదుపుతప్పి నీటిలో పడి పోయింది. స్థానికులు గుర్తించి బయటకు తీసేలోపే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల జీజీహెచ్‌కు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యం విక్రేత అరెస్టు

రుద్రవరం: మండల పరిధిలోని బీరవోలు గ్రామంలో మద్యం విక్రయిస్తున్న మోహ న్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ వరప్రసాద్ తెలిపారు. సమాచారం మేరకు దాడి చేసి 22 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.


నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, కంప్యూటర్ నూతన లాంగ్వేజ్‌లపై పట్టు సాధించాలని సింగపూర్‌కు చెందిన కంప్యూటర్ టెక్నాలజీ మేనేజర్ ఆనంద్‌కృష్ణ అన్నారు. శనివారం వివేకానంద ఆడిటోరియంలో కంప్యూటర్ సైన్స్ సెమినార్ నిర్వహించారు.

ఘనంగా కళాశాల వార్షికోత్సవం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని వెలాసిటీ జూనియర్ కళాశాల వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, మాధవీలత, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా ఉంటాం



మహిళలకు చెక్కు అందజేస్తున్న నాగినిరెడ్డి

బొమ్మలసత్రం: నంద్యాల ప్రజలకు శిల్పా కుటుంబం అండగా ఉంటుందని శిల్పా మహిళా సహకార్ బ్యాంక్ చైర్ పర్సన్ నాగిని రవిసింగారెడ్డి అన్నారు. శనివారం శిల్పా సహకార సంఘం ద్వారా మహిళలకు రుణాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ 131 మంది మహిళలకు రూ.20 లక్షల విలువ జేసే చెక్కులను పంపిణీ చేశామన్నారు.